సాక్షి
పార్వతీపురం మన్యం

బుధవారం । 26 । మార్చి । 2025



ఎవరి లాభం కోసం..!

అల్లుడు వచ్చేంతకు వరకు అమావాస్య ఆగదన్న చందాన తయారైంది ప్రభుత్వం తీరు. అపరాల కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- IIలో



తరలిపోతున్న వృక్ష సంపద..!

కొమరాడ మండలం నుంచి వేలాది రూపాయల విలువ చేసే అటవీ సంపద రాత్రివేళ నాటుబళ్లు, ట్రాక్టర్ల సహాయంతో తరలిపోతోంది.

- IIలో

ఇఫ్తార్	సహార్
బుధ (సా)	గురు (ఉ)
6.12	4.46

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

2వేల ఎకరాలు నిమ్మగడ్డి సాగుకు అనుకూలం

- 4,240 హెక్టార్లలో అంతర పంటల సాగుకు ప్రణాళికలు
- సీఎం చంద్రబాబుకు వివరించిన కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: జిల్లాలో రెండు వేల ఎకరాలు నిమ్మగడ్డి సాగుకు అనుకూలంగా ఉన్నాయని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సీఎం చంద్రబాబు నాయుడుకు వివరించారు. రెండు రోజుల కలెక్టర్ల సమావేశంలో భాగంగా రాష్ట్ర సచివాలయంలో కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మంగళవారం మాట్లాడుతూ ఈ ఏడాది 1000 ఎకరాల్లో నిమ్మగడ్డి సాగుకు ప్రణాళికలు సిద్ధంచేశామన్నారు. వచ్చేఏడాది నాటికి 2 వేల ఎకరాల్లో సాగుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఒడిశా రాష్ట్రంలోని రైతులు వేల ఎకరాల్లో నిమ్మగడ్డి సాగుతో పాటు అంతర పంటలను సాగు చేస్తూ అధిక లాభాలు ఆర్జిస్తున్నారన్నారు. ఆ దిశగా జిల్లాలోని రైతులను ప్రోత్సహిస్తున్నట్టు వెల్లడించారు. 4,240 హెక్టార్లలో అంతర పంటల సాగుకు ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. ఇతర పంటలను సాగు చేసుకునేలా ప్రోత్సహించేందుకు రైతులను ఎక్స్‌పోజర్ విజిట్‌కు తీసుకెళ్లినట్టు వివరించారు.

స్పందించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్...



హరిజన వీధిలో రిగ్‌బోరు ఏర్పాటు

జియ్యమ్మవలస రూరల్: జియ్యమ్మవలస మండల కేంద్రంలో తాగునీటి వెతలపై ఇటీవల ఖాళీ బిందెలతో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట మహిళలు ధర్నా చేశారు. జిల్లాలో తాగునీటి వెతలపై ఇటీవల 'ప్ర'జల' పాట్లు' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. తాగునీటి సరఫరాకు వీలుగా ఎంపీడీఓ ఎస్.రమేష్ స్థానిక హరిజనవాడ సమీపంలో రిగ్‌బోర్ తీయించారు.

ఆయన దారి.. అడ్డదారి..!



సాక్షి, పార్వతీపురం మన్యం:

అనగనగా ఓ నాయకుడు.. తాను ఎదగాలనుకున్న క్రమంలో అడ్డుగా ఉన్న వారందరినీ తొక్కుకుపోయాడు. చివరికి తాను అనుకున్న పీఠంపై ఆసీనులయ్యాడు. అక్కడితో ఆగలేదు.. ముమ్ముందు ముప్పు రాకుండా, తెలివిగా పావులు కదిపాడు. అప్పటికే ఉన్న సీనియర్లకు పొగపెట్టాడు. అధిష్టానం వద్ద ఉన్నవీలేనివీ నూరిపోశాడు. పార్టీ దరిదాపులకు కూడా వారిని రానీయకుండా చేయడంలో విజయం సాధించాడు. అక్కడితో ఆగిపోతే 'రాజకీయం' ఏముంటుందనుకున్నాడో.. లేక, సొంతంగా తన బలగాన్ని తయారు చేసుకోవాలనుకున్నాడో.. లేదంటే, అధిష్టానం వద్ద 'సెహభాష్' అనిపించుకోవాలని అనుకున్నాడో ఏమో... నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించి పక్క పార్టీలో ఉన్న 'చోటా' నేతలను మచ్చిక చేసుకోవడం మొదలుపెట్టాడు. వారిని కలుపుకొంటూ, తనను నమ్మి పెద్ద ఎత్తున పార్టీలోకి వస్తున్నారని 'బిల్డప్' ఇవ్వడం మొదలుపెట్టాడు. ఇదీ.. జిల్లాలోని ఓ నియోజకవర్గంలో ఒక నాయకుడు ఆడుతున్న 'రాజకీయ' జూదం.

విజేత ఎవరైనా.. 'విశ్వాసం'పైనే మచ్చ

ఈ జూదంలో ఎవరు గెలుస్తారన్నది తర్వాత విషయం. వారి పన్నిన వ్యూహం ఫలిస్తుందో లేదో కాలం తేలుస్తుంది. ప్రజలు మాత్రం వెన్నుపోటు నాయకుల 'విశ్వాసం'పైనే చర్చించుకుంటున్నారు. ఇంకా ఎన్నాళ్లు లేని పదవి కోసం విలువలను 'తాకట్టు' పెట్టాలా? అని గుసగుసలాడుకుంటున్నారు. తమను గెలిపించిన ప్రజల మాటకు విలువిస్తారో.. లేకుంటే తమ రాజకీయ నాయకుల ప్రలోభాలే వారికి ముఖ్యమో చూడాలి.

నేనే రాజు.. నేనే మంత్రి

జిల్లాలోని కీలక నియోజకవర్గానికి చెందిన నేత.. తాతలు పేరు చెప్పుకుని, గత ఎన్నికలకు ముందు అనూహ్యంగా తెరపైకి వచ్చారు. అధిష్టానం ఆశీస్సులతో 'పెద్ద' సీటుపైనే ఆయన కన్ను పడింది. అప్పటికే ఆ స్థానంపై ఆశలు పెట్టుకున్న వారిని తొక్కేసి, టికెట్ పొందారు. భవిష్యత్తులోనూ తనకు ఎదురుండకూడదని.. ఎదుగుదలకు ఎవరూ అడ్డు కారాదని దశాబ్దాలుగా పార్టీనే నమ్ముకుని ఉన్న ఓ సీనియర్ నాయకుడిని, మరో మాజీ ఎమ్మెల్యేను అధిష్టానం వద్ద బద్నాం చేయడం మొదలుపెట్టాడు. ఇక్కడ తానే రాజు.. తానే మంత్రి అన్న చందంగా వ్యవహరించడం ప్రారంభించాడు. ఈయన దెబ్బకు.. రాష్ట్రస్థాయిలోనే మంచి పేరున్న ఆ నాయకులు సైతం తేరుకోలేకపోయారు. చిరునామా లేకుండా గల్లంతయ్యారు. చివరికి 'టక్కరి' నేత అదృష్టం బాగుండి.. కలలుగన్న 'సీటు' దక్కింది. అధికారం చేజిక్కింది. దీంతో అదిలింపులు, బెదిరింపులు ఎక్కువయ్యాయి. దౌర్జన్యాలు పెరిగిపోయాయి. మూడు సెటిల్‌మెంట్లు.. ఆరు దందాలుగా సాగిపోతోంది ఆయన వ్యవహారం. ఈ క్రమంలోనే 'పుర' కుర్చీపై అతని కన్నుపడింది. 'స్థానికం'గా పావులు కదపడం మొదలుపెట్టారు. ఏనాటికైనా 'తనవారిని' ఆ కుర్చీ మీద కూర్చోబెట్టాలని కలలుగన్నారు. దూకుడు మీద వెళ్లారు. ఊరిలో కొన్ని రోజులు హడావిడి చేశారు. అంతా మాదే అన్నట్లు జోరు పెంచారు. అందుకోసం పన్నిన వ్యూహం ఒక దశలో బెడిసికొట్టింది. దీంతో కాస్త సైలెంట్ అయ్యారు. ప్లేటు మార్చి, ఆ కుర్చీకి సంబంధించిన 'కాళ్లన్నీ' 'విరగ్గొట్టడం' మొదలుపెట్టారు. బెదిరించో, భయపెట్టో, ప్రలోభపెట్టో.. తమ దారికి తెచ్చుకున్నారు. ఇందుకు ఓ 'జంపింగ్' బాబు తెలివితేటలు ఉపయోగపడ్డాయి. సదరు జంపింగ్ నాయకుడు కూడా తక్కువేమీ కాదు. ఆయన గారి భార్యకు ఆ పదవి కట్టబెట్టేందుకు.. ఈయనను పావుగా వాడుకుంటున్నాడు. అందుకు అవసరమైన బలగాన్నీ తానే సమకూర్చిపెడుతున్నాడు. తమను నమ్మి టికెట్ ఇచ్చిన పార్టీకి విధేయులుగా, విశ్వాసపాత్రులుగా ఉంటామని ప్రగల్భాలు పలికి.. 'అవిశ్వసనీయత'ను ప్రదర్శించి, వెన్నుపోటు రాజకీయాలకు తెర తీశారు.

కళ్లకు గంతలు కట్టొద్దు

- నిజాలు చెప్పాలని గిరిజన సంఘం వినతి
- మోకాళ్లపై వేడుకోలు..
- 'కోట' బాలికల ఆశ్రమ పాఠశాల కోసం ఆందోళన



చిలకపాడు గ్రామంలో మోకాళ్లపై నిల్చుని నిరసన తెలుపుతున్న గిరిజనులు

శృంగవరపుకోట: గిరిజనుల కళ్లకు గంతలు కట్టకుండా ప్రభుత్వం నిజాలు చెప్పాలని ఏపీ గిరిజన సంఘం సభ్యులు విజ్ఞప్తిచేశారు. గిరిజన బాలికల కోసం ఎస్.కోట పట్టణంలో బాలికల ఆశ్రమ పాఠశాల ఏర్పాటు చేయాలని వేడుకున్నారు. ఎస్.కోట మండలంలోని ధారపర్తి పంచాయతీ పరిధిలోని చిలకపాడు గ్రామంలో పలువురు గిరిజన విద్యార్థులు, చిన్నారులు, వారి తల్లిదండ్రులతో కలిసి సంఘ నాయకులు జె.గౌరీష్, జె.భీమయ్య, మంగళయ్యలు మంగళవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. చిన్నా పెద్ద అంతా మోకాళ్లపై నిల్చొని కలెక్టర్, ప్రభుత్వ పెద్దలకు నమస్కారాలు చేస్తూ తమ గోడు వినిపించారు. జిల్లా కేంద్రమైన విజయనగరంలో 160 మందికి సరిపడే భవనంలో 260 మందికి అడ్మిషన్లు ఇచ్చారని, ఆపై చేరిన బాలికలను పార్వతీపురం, సాలూరులోని ఆశ్రమ పాఠశాలలకు పంపుతున్నారన్నారు. తమ పిల్లలు చదవాలని కొండలు, కోనలు దించి ఆడపిల్లలను పంపుతున్నారని, వారికి రోగమొచ్చినా, కష్టమొచ్చినా 50 నుంచి 70 కి.మీ మేర గిరిజన తల్లిదండ్రులు ప్రయాణాలు చేయాల్సి వస్తోందని చెప్పారు. మన్యానికి ముఖ ద్వారంగా ఉన్న ఎస్.కోటలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ఏర్పాటుచేసి బాలికా విద్యను ప్రోత్సహించాలని కోరారు. బాలికల చదువు సమస్యలను నిజాయితీగా అధ్యయనం చేయాలని డిమాండ్ చేశారు.

ఊరిబడి రక్షణకు పోరుబాట



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

- ప్రాథమిక పాఠశాలల నుంచి 3, 4, 5 తరగతులు తరలించవద్దు
- యూపీ పాఠశాలలను కొనసాగించాలి
- యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌కు భారీ ర్యాలీ
- అక్కడ ఆందోళన



కలెక్టరేట్‌ను ముట్టడించిన ఉపాధ్యాయులు, యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు



డీఆర్‌ఓ హేమలతకు వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

పార్వతీపురం టౌన్: ఊరిబడిని రక్షించాలని, ప్రాథమిక పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు రెడ్డి మోహన్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్లు, విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఆర్వో హేమలతకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో ఒక మోడల్ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలని, ఏ ప్రాథమిక పాఠశాల నుంచి 3,4,5 తరగతులను తరలించ వద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూపీ పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని, తెలుగు, ఇంగ్లిష్, సమాంతర మీడియం కొనసాగించాలని కోరారు. ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వర్యం చేయకుండా బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు ఎస్.మురళీమోహన్‌రావు, కె.విజయగౌరి, జిల్లా నాయకులు టి.రమేష్, కె.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కొటియా వివాదాన్ని పరిష్కరించాలి



ఎగువసెంబిలో సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న గిరిజనులు

సాలూరు రూరల్: ఆంధ్రా–ఒడిశా సరిహద్దులోని వివాదాస్పద కొటియా గ్రూపు గ్రామాల వివాదాన్ని పరిష్కరించాలని, గిరిజనులపై ఒడిశా ప్రభుత్వ దౌర్జన్యాలను ఆంధ్రా ప్రభుత్వం అడ్డుకోవాలంటూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఎగువసెంబిలో గిరిజనులు మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా మండల కమిటీ నాయకుడు మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ 21 కొటియా గ్రామాల సమస్య దశాబ్దాలుగా కొనసాగుతోందన్నారు. ఒడిశా–ఆంధ్రాలో ఒకే ప్రభుత్వం ఉన్నందున సమస్యకు చెక్ చెప్పాలన్నారు. ఎన్నో ఆశలతో మంత్రి సంధ్యారాణిని గెలిపించినా సమస్య పట్టించుకోవడం లేదన్నారు. సెంబిలో ఒడిశా అధికారులు కంచె వేసి గిరిజనుల భూములను ఆక్రమించడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు గెమ్మెల జానకిరావు, కోనేటి సుబ్బా, తాడంగి చరణ్, మర్రి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

గిరిశిఖర గ్రామాల్లో ఆగని మరణాలు

- అనారోగ్యంతో మరో చిన్నారి మృతి
- అంతు చిక్కని కారణాలు
- ఆందోళనలో ధారపర్తి గిరిజనులు
- వ్యాక్సినేషన్ లేకపోవడమే కారణమా?



చనిపోయిన చిన్నారితో తల్లి సీతమ్మ (ఇన్‌సెట్లో) చనిపోయిన చిన్నారి (ఫైల్)

శృంగవరపుకోట: గిరిశిఖర గ్రామాల్లో మరణమృదంగం వినిపిస్తోంది. ఒక తల్లి గర్భశోకం మరిచిపోకముందే మరో తల్లికి గర్భశోకం కలుగుతోంది. ఎస్.కోట మండలం ధారపర్తి పంచాయతీ వరుస మరణాలతో వణుకుతోంది. స్పందించాల్సిన వైద్యారోగ్యశాఖ చేష్టలుడిగి చూస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మరణాలు ఏకారణంతో జరుగుతున్నాయన్న కనీస విచారణ లేకుండా వైద్యులు చేతులు దులిపేసుకుంటున్నారని గిరిజనులు వాపోతున్నారు. ధారపర్తి గ్రామానికి చెందిన కురిన బోయిన గంగులు–సీతమ్మల ఐదు నెలల కుమారుడు మంగళవారం ఉదయం విజయనగరంలోని ఘోషా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రెండు నెలల కిందట ఇదే పంచాయతీకి చెందిన జన్ని విజయ్ అనే చిన్నారి తనువుచాలించాడు. ఈ ఘటనపై ఆదివాసీ గిరిజన సంఘ సభ్యులు, చనిపోయిన చిన్నారి తల్లిదండ్రులు, కుటుంబీకులు అంతా తమ ప్రాణాలకు సరైన గ్యారంటీ దక్కడం లేదని, చిన్నారుల ప్రాణాలు గాలిలో కలిసి పోతుంటే వైద్యసిబ్బంది నిమ్మకు నీరెత్తినట్టు కూర్చున్నారంటూ ఆందోళనకు దిగారు. చిన్నారుల మరణానికి సకాలంలో వాక్సినేషన్ వేయకపోవడమే కారణమన్న వాదన వినిపిస్తోంది. పంచాయతీలోని చిన్నారులకు వాక్సినేషన్ లేకుండా చేసిన భారీ తప్పిదానికి వైద్యారోగ్యశాఖ అధికారులు ఇద్దరు ఉద్యోగులను బదిలీ చేసి చేతులు దులిపేసుకున్నా... చిన్నారుల మరణాలు అందరినీ కలచివేస్తున్నాయి.

రిఫర్ చేశాం..

ధారపర్తికి చెందిన చిన్నారి మరణం పట్ల ఎస్.కోట ఏరియా ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ నీల స్పందించారు. తొలుత చిన్నారి తక్కువ బరువుతో పుట్టాడని, జిల్లా కేంద్రంలో ఘోషా ఆస్పత్రిలో వైద్య సేవలు అందజేశారు. ఈ నెల 3వ తేదీన చిన్నారికి ఆయాసం రావడంతో ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. వారం రోజుల పాటు వైద్యసేవలు అందజేశాం. కోలుకున్నాక ఈ నెల 10న డిశ్చార్జ్ చేశాం. తిరిగి 23వ తేదీ రాత్రి 11.30కి చిన్నారి ఆరోగ్యం క్షీణించిందంటూ ఆస్పత్రికి తెచ్చారు. ఎలాంటి సమస్య లేకున్నా ఆయాసం తగ్గక పోవడంతో జీవక్రియలకు సంబంధించి ఇబ్బంది ఉండొచ్చని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ పిడియాట్రిక్స్‌కు 24వ తేదీ మధ్యాహ్నం 1.30 గంటలకు రిఫర్ చేశాం. ఘోషా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చిన్నారి చనిపోయినట్టు తెలిసిందని తెలిపారు.

చేపలవలకు చిక్కిన పాము



వలకు చిక్కిన పాము

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురం గ్రామానికి చెందిన బందలుప్పి గోపి బాసంగి ముంపుడులో చేపల కోసం మంగళవారం వేసిన వలకు ఆరడుగుల పొడవున్న నాగజెర్రి చిక్కింది. దీనిని చూసిన గోపి భయంతో పరుగు తీశారు. పరిసరాల్లోని రైతులను పిలిచి వలను బయటకు తీసి పాముకు విముక్తి కల్పించాడు.

గూడులేని పేదలపై.. కూటమి చిన్నచూపు

- ఎన్నికల ముందు ప్రతిఒక్కరికీ ఇంటి స్థలం ఇస్తామని హామీ
- గత ప్రభుత్వంలో 27వేల మందికి ఇళ్లు మంజూరు
- జిల్లాలో 6,980 మంది ఇళ్లు లేనివారు
- గ్రామాల్లో 3, పట్టణాల్లో 2 సెంట్ల స్థలాలు ఇవ్వాలి
- టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలి
- గిరిజనులు సాగుచేస్తున్న పోడు భూములకు పట్టాలివ్వాలి
- కలెక్టరేట్ ఆవరణలో సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా



కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా కలెక్టరేట్ వద్ద సీపీఐ నాయకులు, గిరిజనులు, ఇళ్ల స్థలాల లబ్ధిదారుల ఆందోళన



డీఆర్వో హేమలతకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

పార్వతీపురంటౌన్: కూటమి ప్రభుత్వం పేదలకు ఉపయోగపడే ఒక్క కార్యక్రమమూ తలపెట్టడం లేదంటూ సీపీఐ నాయకులు మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు పదినెలలు కావస్తున్నా ఇప్పటి వరకు పేదల ఇళ్ల నిర్మాణం, స్థలాల మంజూరుకు సంబంధించి ఒక్క అడుగు ముందుకు వేయలేదన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పేదల సొంతింటి కళ నెరవేర్చుకోవాలన్న ఆశ సామాన్య కుటుంబాలకు అందని ద్రాక్షగా మిగిలిందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, కామేశ్వరరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. కలెక్టర్ జిల్లాలో ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న వారితో కలిసి మంగళవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. అనంతరం డీఆర్వో హేమలతకు వినతిపత్రం అందజేశారు. సొంత స్థలంలో ఇల్లు కట్టుకొనే కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేయాలని కోరారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో లబ్ధిదారులకు 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో లబ్ధిదారులకు 2 సెంట్లు స్థలం మంజూరు చేయాలని కోరారు. జిల్లాలో ఇప్పటి వరకు ఇంటి స్థలాల కోసం 6,980 మంది లబ్ధిదారులు వేచి చూస్తున్నారని, వారికి తక్షణమే న్యాయం చేయాలన్నారు.

సర్వేల పేరుతో కాలక్షేపం

ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి లేనిపోని సర్వేలో ప్రజాసంక్షేమ పథకాలు అందజేయకుండా కాలక్షేపం చేస్తోందని సీపీఐ నాయకులు విమర్శించారు. పీ–4 సర్వే ఇందులో భాగమేనన్నారు. సాధ్యం కాని పొజిషన్ సర్టిఫికెట్లు ఉంటేనే అర్హులని నిబంధన పెట్టడం సరైన విధానం కాదన్నారు. 2014–19 టీడీపీ పాలనలో ఇదే పరిస్థితి నెలకొందన్నారు. తొలుత మూడు నెలల పాటు ఇళ్ల నిర్మాణాలకు అవకాశం ఇవ్వకుండా 2018–19 సంవత్సరాల్లో మంజూరు చేయడంతో లబ్ధిదారులు అనేక ఇబ్బందులకు గురయ్యారన్న విషయం గుర్తుచేశారు. టిడ్కో ఇళ్లు అప్పగించడం, పోడు పట్టాల మంజూరులో జాప్యంపై ప్రశ్నించారు. గిరిజనులు సాగు చేసుకున్న పోడు భూములకు పట్టాలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు జీవన్, ఈవీ నాయుడు, సూరయ్య, గోపి, ఆర్‌వీఎస్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పోడుపట్టాలివ్వాలి



మేము సాగు చేసుకుంటున్న భూములకు పోడు పట్టాలివ్వాలి. గతంలో ఎన్నికల ముందు టీడీపీ నాయకులు మా గ్రామానికి వచ్చి పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. తీరా అధికారం చేపట్టిన తరువాత ఇప్పటి వరకు ఎటువంటి ప్రస్తావన లేదు. అధికారులు తక్షణమే మాకు పట్టాలు మంజూరు చేయాలి.

– కొండగొర్రి లక్ష్మి, లిడికి వలస గ్రామం

ప్రభుత్వం స్పందించాలి



ప్రజలకిచ్చిన హామీలు అమలుచేయడంపై కూటమి ప్రభుత్వం స్పందించాలి. ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పోడు పట్టాలు, ఇళ్ల పట్టాలు అందజేయడంలేదు.

– బి.కృష్ణ, బుట్టగూడ గ్రామం, గుమ్మలక్ష్మీపురం

కాళ్లరిగేలా తిరుగుతున్నాం..



ఇంటిస్థలం మంజూరు చేయాలని గత ఆరు నెలలుగా కాళ్లరిగేలా అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. ప్రభుత్వం నుంచి సైట్లు ఓపెన్ కావడం లేదని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. మంజూరు చేయడం అవకాశం లేదని ఎన్నికల ముందు చెబితే బాగుండేది. ఎన్నికల ముందు చెప్పేదొకటి, అధికారం చేపట్టిన తరువాత చేసేదొకటి. మాకు ఇంటి స్థలం మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

– పి. వెంకటస్వామి, దిగువమండ గ్రామం, గుమ్మలక్ష్మీపురం

క్లుప్తంగా

పుష్పాలంకరణలో పైడితల్లి



వనంగుడిలో పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడిలో కొలువైన అమ్మవారికి సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్‌లు శాస్త్రోక్తంగా పూజాధికాలు జరిపారు. రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలో అర్చకులు నేతేటి ప్రశాంత్ అమ్మవారిని పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధనలు చేశారు. కార్యక్రమాలను ఆలయ ఇన్‌చార్జి ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్ పర్యవేక్షించారు.

రాజీపేట పరిసర ప్రాంతాల్లో ఏనుగుల గుంపు



రాజీపేట పరిసర ప్రాంతాల్లో ఉన్న ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని చింతలబెలగాం పంచాయతీ రాజీపేట పరిసర ప్రాంతాల్లోని పంట పొలాల్లో ఏనుగులు మంగళవారం దర్శనమిచ్చాయి. ఉదయం వెంకటరాజపురంలోని వరిపంటను ధ్వంసం చేసి సాయంత్రానికి వెంకటరాజపురం, బాసంగి మీదుగా చింతలబెలగాం, రాజీపేట గ్రామంలోకి జారుకున్నాయి. రాత్రి సమయమంలో గ్రామంలోకి చొచ్చుకు రావడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. వరిపంట, అరటి ఉండడంతో పంటలను ధ్వంసం చేస్తే పూర్తిగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగుచర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యార్థినికి డీఈఓ అభినందనలు



విద్యార్థినిని అభినందిస్తున్న డీఈఓ

పాచిపెంట: లక్నోలో ఇటీవల జరిగిన 1500 మీటర్లు, 3వేల మీటర్ల పరుగుపందెంలో పాచిపెంట మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని జోత్స్న పాల్గొంది. అండర్ 17 విభాగంలో జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థినిని డీఈఓ నాయుడు మంగళవారం అభినందించారు. విద్యార్థినికి పాఠశాల హెచ్ఎం ఈశ్వరరావు, ఉపాధ్యాయులు తదితరులు అభినందనలు తెలిపారు.

మహిళ మృతిపై కేసు నమోదు

రాజాం సిటీ: పట్టణ పరిధి మల్లికార్జునకాలనీ 7వ లైన్‌లో నివాసం ఉంటున్న కెల్ల లక్ష్మి (44) మృతిచెందడంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. వీధిలో దుర్వాసన రావడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. రెవెన్యూ సిబ్బంది సహాయంతో ఇంటి తలుపులు తీయగా ఇంటిలోపల ఆమె మృతదేహం కనిపించిందని ఎస్సై తెలిపారు. మూడు రోజుల క్రితమే ఆమె మృతిచెంది ఉంటుందని, ఇంట్లో ఒక్కతే ఉండేదని, ఆమె కుమారుడు దుర్గాప్రసాద్ విశాఖపట్నంలో ఉంటున్నాడని చెప్పారు. ఆమె కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఎవరి లాభం కోసం..!

- అంతా అయిపోయాక కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- రైతులు ఇప్పటికే విక్రయించేసిన పెసలు, మినుములు
- ప్రభుత్వ మద్దతు ధర క్వింటా పెసలు రూ.8682
- మినుములు రూ.7400
- తక్కువ ధరకే వ్యాపారులకు అమ్మేసుకున్న రైతులు



గంట్యాడ రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన అపరాల కొనుగోలు కేంద్రం

విజయనగరం ఫోర్ట్: అల్లుడు వచ్చేంతకు వరకు అమావాస్య ఆగదన్న చందాన తయారైంది ప్రభుత్వం తీరు. రైతులు పండిన పంటను విక్రయించుకున్న తర్వాత కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వ్యాపారులకు మేలు చేయడానికి ఇప్పుడు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారనే



విజయనగరం మండలం పినవేమలిలో సాగులో ఉన్న పెసరపంట (ఫైల్)

జిల్లాలో ఐదు కేంద్రాలు

జిల్లాలోని గంట్యాడ, బొబ్బిలి, జామి మండలంలో విజినిగిరి, సంతకవిటి, గజపతినగరంలో అపరాల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. విజినిగిరి కేంద్రంలో కేవలం 15 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మిగతా నాలుగు కేంద్రాలకు ఒక్కరు కూడా రాలేదు. ఈనెల 19వతేదీన అపరాల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు ఒక్క గింజ కూడా కొనుగోలు చేసింది లేదని తెలిసింది.

ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రబీలో రైతులు సాగు చేసిన అపరాలను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఇప్పుడు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వారం రోజులవుతున్నా ఇంతవరకు ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

కొనుగోలు కేంద్రాల జాప్యంతో తక్కువధరకే విక్రయం

అపరాలు (పెసర, మినుము) పంటల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటులో జాప్యం వల్ల రైతులు తాము పండించిన పెసర, మినుములను తక్కువ ధరకే విక్రయించేశారు. ప్రభుత్వం ప్రస్తుతం ప్రకటించిన మద్దతు ధర క్వింటాకు పెసలు రూ.8,682, మినుములు రూ.7,400. అయితే అధిక శాతం మంది ఫిబ్రవరి నెలలోనే వ్యాపారులకు విక్రయించారు. కొనుగోలు కేంద్రాలు అలస్యం అవడంతో పెసలు క్వింటా రూ.6,500, మినుములు క్వింటా రూ.6వేలు చొప్పున రైతులు అమ్ముకున్నారు. క్వింటాకు రూ.1,500 నుంచి రూ.2 వేల వరకు రైతులు నష్టపోయారు.

6116 హెక్టార్లలో పెసర సాగు

జిల్లాలో పెసర పంట 6116 హెక్టార్లలో సాగైంది. 3792 మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి వచ్చింది. అదేవిధంగా మినుము పంట 16,523 హెక్టార్లలో సాగైంది. 10,409 మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి వచ్చింది.

అధిక వర్షాలతో చాలావరకు నష్టం

జిల్లాలో గత ఏడాది డిసెంబర్ నెలలో కురిసిన వర్షాలు వల్ల పెసర, మినుము పంటలు చాలా వరకు దెబ్బతిన్నాయి. దీని వల్ల దిగుబడి కూడా చాలా వరకు తగ్గింది. వచ్చిన కొద్దిపాటి పంటకు కూడ మద్దతు ధర రాని పరిస్థితి. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాలు వ్యాపారుల కోసమేననే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫిబ్రవరి నెలలోనే రైతులు పెసర, మినుము పంటలు విక్రయించేశారు. వాటిని వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేశారు, ఇప్పుడు వాటిని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు వ్యాపారులు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విజినిగిరిలో 15 మంది రిజిస్ట్రేషన్

జిల్లాలో ఐదు చోట్ల అపరాల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. విజినిగిరి కొనుగోలు కేంద్రంలో 15 మంది అపరాలు విక్రయించడానికి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. మిగిలిన నాలుగు చోట్ల ఇంకా ఎవరూ రాలేదు.

ఎస్.వెంకటేశ్వరావు, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్

డ్రోన్ దెబ్బ.. పేకాటరాయుళ్ల అబ్బా..!



హుకుంపేటలో పేకాట ఆడుతున్న వారిని గుర్తించిన డ్రోన్

విజయనగరం క్రైమ్: జిల్లాలో డ్రోన్స్ సహాయంతో పేకాట, కోడి పందాలకు పోలీసులు చెక్ పెడుతున్నారు. విజయనగరంలోని హుకుంపేట శివారు, పూసపాటిరేగ మండలం వెంపడాం వద్ద మంగళవారం పోలీసులు డ్రోన్స్ ఉపయోగించి పేకాట ఆడుతున్న, కోడి పందాలు నిర్వహిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు వచ్చిన కచ్చితమైన సమాచారంతో విజయనగరం టూటౌన్ సీఐ టి.శ్రీనివాసరావు సిబ్బంది హుకుంపేట శివారులో పార్కింగ్ చేసిన లారీలో పేకాట ఆడుతున్న వారిపైకి డ్రోన్‌ను వంపి, శివారు ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు నిర్ధారించుకుని, రైడ్ చేసి పారిపోతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.12,600 నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

కోడి పందాల శిబిరంపై దాడి

అలాగే జిల్లా కేంద్రానికి దగ్గరలో ఉన్న పూసపాటిరేగ మండలం వెంపడాం గ్రామ శివారులో కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ పోలీసులకు వచ్చిన సమాచారంతో వారిపైకి డ్రోన్ పంపి, సుదూర ప్రాంతంలో కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు నిర్ధారించుకుని భోగాపురం రూరల్ సీఐ జి.రామకృష్ణ, పూసపాటిరేగ ఎస్సై దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పోలీస్‌సిబ్బంది రైడ్ చేసి, కోడి పందాలు ఆడుతూ, పారిపోతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.15,600 నగదు, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్లు ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. నేర నియంత్రణలోను, శివారు ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు డ్రోన్స్‌ను వినియోగిస్తున్నామని, పట్టణ, గ్రామ శివారు ప్రాంతాలపై డ్రోన్స్ సహాయంతో నిఘా పెడుతున్నామని ఎస్పీ ఈ సందర్భంగా చెప్పారు.

తరలిపోతున్న వృక్ష సంపద..!

- పట్టించుకోని రెవెన్యూ, అటవీశాఖ అధికారులు



రాత్రివేళ ట్రాక్టర్ల సహాయంతో తరలిస్తున్న టేకుకలప



నాటుబళ్ల సాయంతో తరలించేందుకు సిద్ధంగా ఉన్న టేకు కలప

కొమరాడ: మండలం నుంచి వేలాది రూపాయల విలువ చేసే అటవీ సంపద రాత్రివేళ నాటుబళ్లు, ట్రాక్టర్‌ల సహాయంతో తరలిపోతోంది. పట్టించుకోవాల్సిన రెవెన్యూ, అటవీశాఖ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా వృక్ష సంపద నరికి వేస్తుండడంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోంది. ఒడిశా సరిహద్దు నుంచి టేకు కలప చడీచప్పుడు లేకుండా రవాణా సాగిస్తున్నారు. ఈ వ్యవహారంలో కొంతమంది అక్రమ వ్యాపారులు, రెవెన్యూ సిబ్బంది కుమ్మక్కైనట్లు తెలుస్తోంది. టేకుకలప తరలించాలంటే కచ్చితంగా రెవెన్యూ శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలి. కొమరాడ మండలం నుంచి పార్వతీపురం సా మిల్లులకు తరలించిన తరువాత అక్కడినుంచే సంబంధిత శాఖ అధికారులకు మామూళ్లు వెళ్తాయని సమాచారం. దీనికి సంబంధించి ఉన్నతాధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పరీక్షలంటే భయాన్ని వీడండి

- ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ



విద్యార్థులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్, ఇన్‌చార్జ్ ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ

సాలూరు: విద్యార్థులు పరీక్షలంటే భయాన్ని విడనాడాలని సబ్‌కలెక్టర్, ఇన్‌చార్జ్ ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన పాచిపెంట మండలంలోని పి.కోనవలస గిరిజన గురుకుల బాలుర పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు వండిన భోజనాన్ని రుచి చూసి మెనూ పరిశీలించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ పరీక్షలు ఏ విధంగా రాస్తున్నారు? ఏ విధమైన ప్రణాళిక ద్వారా చదువుతున్నారు? ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు లక్ష్యంతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు. పరీక్షల్లో ప్రణాళికా బద్ధంగా చదవడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వయోశ్రేష్టుల సంరక్షణ చట్టాన్ని అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర వయోశ్రేష్టుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంపరాల నారాయణమూర్తి

విజయనగరం టౌన్: వయోశ్రేష్టుల సంరక్షణ చట్టాన్ని ప్రతి జిల్లాలో కచ్చితంగా అమలుచేయాలని ఆలిండియా సీనియర్ సిటిజన్స్ కాన్ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్, రాష్ట్ర వయోశ్రేష్టుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంపరాల నారాయణమూర్తి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో వయోశ్రేష్టుల రాష్ట్ర కార్యవర్గ కౌన్సిల్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సబ్‌డివిజనల్ స్థాయిలో ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి రెవెన్యూ సబ్ డివిజన్ స్థాయిలో వచ్చే సమస్యలను పరిష్కరించాలని, కలెక్టర్ స్థాయిలో అప్పిలేట్ ట్రిబ్యునల్ ఏర్పాటుచేసి జిల్లా స్థాయిలో వచ్చే వయోశ్రేష్టుల సమస్యలను 90 రోజుల్లో పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. ప్రతి జిల్లాలోనూ కమిటీలు వేసి మూడు నెలలకొకసారి కమిటీ సమావేశం నిర్వహించి వయోశ్రేష్టుల సంక్షేమంపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వయోశ్రేష్టుల శేషజీవితం ఆధ్యాత్మికంగా, ఆరోగ్యంగా, ఆర్థికంగా సమృద్ధిగా ఉండేలా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్ర అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ కట్టమూరి చంద్రశేఖర్ ప్రార్థన గీతంతో ప్రారంభమైన సమావేశంలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పరమేశ్వర రెడ్డి, కార్యదర్శి రామచంద్రరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు, సత్యనారాయణమూర్తి, వెంకటరమణ, తదితరులు దివంగత కేపీ ఈశ్వర్ మృతిపట్ల మౌనం పాటించారు. సమావేశంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆర్.ఎస్.కుప్పూరావు, ప్రతినిధులు త్రినాథప్రసాద్, బసవమూర్తి, జగన్నాథరావు, గిడుతూరి పైడితల్లి, అధిక సంఖ్యలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణుల పట్ల అప్రమత్తం

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు



ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు

భామిని: ఆస్పత్రి ప్రసవాలకు ప్రాధాన్యం ఇచ్చి, హైరిస్క్ గర్భిణుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ భాస్కరరావు సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన భామిని మండలంలోని బత్తిలి, భామిని, బాలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. బత్తిలి పీహెచ్‌సీలో నిర్వహిస్తున్న న్యూట్రీ–గార్డెన్‌ను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రులకు వస్తున్న రోగులతో మాట్లాడి అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. భామిని పీహెచ్‌సీలో మందుల నిల్వలు పరిశీలించి, ల్యాబ్‌లో చేస్తున్న పరీక్షలను గుర్తించారు. బాలేరు పీహెచ్‌సీలో వైద్యసిబ్బంది హాజరు పట్టీ పరిశీలించారు. డీఎంహెచ్‌ఓ వెంట బత్తిలి డాక్టర్లు రవీంద్ర, దామోదరరావు, భామిని వైద్యులు సోయల్, సంతోషిలక్ష్మి, బాలేరు వైద్యాధికారి శివకుమార్, సీహెచ్‌ఓ భాస్కరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో అప్రెంటిస్ మేళా రేపు

బొబ్బిలి: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 27న హైదరాబాద్‌కు చెందిన టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్, బొబ్బిలిలోని పటాల్ రెయిల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రై.లిమిటెడ్ కంపెనీలు అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జీవీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెషినిస్ట్, టర్నర్, వెల్డర్ ట్రేడులలో ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు హాజరుకావచ్చన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆరోజు ఉదయం 9 గంటలకు టెన్త్ మార్క్స్‌లిస్ట్, ఐటీఐ మార్క్స్ లిస్ట్, ఆధార్, కుల ధ్రువీకరణ, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. బయోడేటా, ఫొటోలను జతపర్చి నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹107	₹184	₹194

ఇరుగ్రామాల యాదవుల కొట్లాట

- ఆరుగురికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం



క్షతగాత్రులు ఈశ్వరరావు, లక్షుంనాయుడు

బాడంగి: గొర్రెల మేత విషయంలో ఇరుగ్రామాలకుచెందిన యాదవులు కొట్లాటకు దిగడంతో ఘటనలో ఆరుగురు గాయపడ్డారు. ఈ ఘటన మంగళవారం మండలంలో జరగ్గా గాయపడిన వారి బంధువులు తెలిపిన సమాచారం ఇలా ఉంది. మండలంలోని గొల్లాది, కామన్నవలస గ్రామాలకుచెందిన యాదవులు గొడవపడి కర్రలతో కొట్టుకోగా కామన్నవలసకు చెందిన పడాల లక్షుం, కామేశ్వరరావు, సింహాచలం, ఆదినారాయణలు, గొల్లాదికి చెందిన ఈపు ఈశ్వరరావు, చప్పసత్యం గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ముగ్గురిని 108లో స్థానిక ఆస్పత్రికి తీసుకురాగా ప్రథమచికిత్స చేసిన డాక్టర్ హారిక వారిలో ఈపు ఈశ్వరరావు, పడాల లక్షుంల పరిస్థితి విషమించడంతో విజయనగరం ఆస్పత్రికి తరలించాలని సూచించారు. ఆస్పత్రి వర్గాల సమాచారం మేరకు క్షతగాత్రుల బంధువుల నుంచి ఫిర్యాదు తీసుకుని పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన ఎర్నాయుడు

గంట్యాడ: మండలంలోని కొర్లాం గ్రామానికి చెందిన లగుడు ఎర్నాయుడు సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. తామరాపల్లి నుంచి గంట్యాడ వైపు వెళ్తున్న బొలెరో వాహనం కొర్లాం జంక్షన్ వద్దకు వచ్చేసరికి సైకిల్‌పై వెళ్తున్న ఎర్నాయుడిని ఢీకొట్టడంతో కింద పడిపోగా తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో స్థానికులు 108 అంబులెన్సులో విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు.

అపార్ట్‌మెంట్‌పై నుంచి పడి రిటైర్డ్ హెచ్‌ఎం మృతి



సంఘటనా స్థలంలో శ్యామ్ సుందర్ మృతదేహం,(ఇన్‌సెట్లో) శ్యామ్ సుందర్ (ఫైల్)

బొబ్బిలి: పట్టణంలోని నాయుడు కాలనీలో గల ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న రిటైర్డ్ హెచ్‌ఎం వై.శ్యామ్‌సుందర్(80) రెండో అంతస్తు నుంచి పడిపోయి మంగళవారం మృతిచెందారు. బాడంగి మండలం పాల్తేరులో హెచ్‌ఎంగా రిటైరైన ఆయన బొబ్బిలిలోని ప్రముఖ వైద్యుడు, ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్ వై.విజయమోహన్ తండ్రి. మంగళవారం మేడపై ఉన్న ఆయన ఆకస్మాత్తుగా కళ్లు తిరిగి కిందికి పడిపోయినట్లు, అల్జీమర్స్‌తో కొద్దికాలంగా బాధపడుతున్నట్లు కోడలు గ్రేస్‌కుమారిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశామని ఎస్సై ఆర్.రమేష్ కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించామని ఎస్సై చెప్పారు.

ఎక్స్‌రే మిషన్ ప్రారంభం



డీఆర్ ఎక్స్‌రే మిషన్‌తో రోగికి ఎక్స్‌రే తీస్తున్న రేడియోగ్రాఫర్

సాక్షి ఎఫెక్ట్

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి కోసం కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన ఆధునాతన ఎక్స్‌రే మిషన్‌ను వినియోగంలోకి తేకుండా వదిలేశారు. ఈ అంశంపై సాక్షిలో ఈనెల 20వతేదీన 'కోటి యంత్రం గదికే పరిమితం' శీర్షికన ప్రచురించిన కథనంపై ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వైద్యాధికారులు స్పందించారు. ఈ మేరకు మంగళవారం డీఆర్ ఎక్స్‌రే మిషన్‌ను సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంబంగి అప్పలనాయుడు ప్రారంభించారు. అనంతరం రోగులకు ఎక్సరేలు తీయడం మొదలుపెట్టారు.



డీఆర్ ఎక్స్‌రే మిషన్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ అప్పలనాయుడు